

నేడు పిజిఆర్ఎస్ రద్దు

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం


మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 27వ తేదీ సోమవారం జరగాల్సిన పిజిఆర్ఎస్ రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అలాగే మండల, డివిజన్, జిల్లా స్థాయిలో రద్దు చేసినట్లు తెలిపారు. మొంథా తుపాన్ కారణంగా జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు విషయం గమనించుకొని ఎవరూ కూడా అర్జీలు తీసుకొని మండల, డివిజన్, కలెక్టరేట్ కార్యాలయాలకు రావొద్దని, సహకరించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

దూసుకొస్తున్న మొంథా

- రెండు జిల్లాల్లో అధికార యంత్రాంగం సర్వ సన్నద్ధం
- ప్రత్యేకాధికారులుగా ఏలూరుకు కాంతిలాల్‌దండే, పశ్చిమకు ప్రసన్నవెంకటేష్
- కలెక్టరేట్, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- గోదావరిపై లాంచీలు, పంటుల రాకపోకలు నిషేధం
- ఆదివారం సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పులు
- బిక్కుబిక్కుమంటున్న తీరప్రాంత ప్రజలు

ప్రజాశక్తి - భీమవరం

మొంథా తుపాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రెండు జిల్లాల్లో అధికార యంత్రాంగం యావత్తూ సన్నద్ధమైంది. జిల్లా కలెక్టర్ల నుంచి గ్రామస్థాయి ఉద్యోగి వరకూ అంతా తుపాన్ ముందస్తు చర్యలకు సంబంధించిన పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)ను రద్దు చేశారు. జిల్లా అధికారుల నుంచి దిగువస్థాయి ఉద్యోగి వరకూ అందరికీ సెలవులు రద్దు చేసి తమ తమ పని ప్రదేశాల్లోనే ఉండాలని కలెక్టర్లు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఇప్పటికే సెలవుల్లో ఉన్నవారిని సైతం సెలవులు రద్దు చేసుకుని విధుల్లోకి రప్పించేలా చర్యలు చేపట్టాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. రెండు జిల్లాలకు



అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసేందుకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ఏలూరు జిల్లాకు కాంతిలాల్‌దండే, పశ్చిమగోదావరి జిల్లాకు ప్రసన్న వెంకటేష్ ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు.

జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మొంథా తుపాన్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఆదివారం జిల్లా ఎస్‌పితో కలిసి పర్యటించారు. కొల్లేరు పెద్దఎడ్లగాడి వద్ద గుర్రపుడెక్క తొలగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొల్లేరులో పడవల రాకపోకలను నిషేధించారు. కొల్లేరుకు వరద ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి మొంథా తుపాన్ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా అధికారులను ఆదేశించారు. పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గోదావరిపై లాంచీల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. నరసాపురం-సఖినేటిపల్లి మధ్య గోదావరిపై పంటు రాకపోకలను సైతం నిలిపివేసి, ఎవరూ గోదావరి వైపు వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ముందస్తుగా ఈ నెల 27, 28 తేదీల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. అత్యవసర వేళల్లో ఆదుకునేందుకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు ఎస్‌డిఆర్ఎఫ్ బలగాలు రానున్నాయి. రెండు జిల్లాల్లో కలెక్టరేట్‌తోపాటు అన్ని ఆర్‌డిఒ, మండల, పట్టణ కేంద్రాలతోపాటు పోలీసు స్టేషన్లలోనూ కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. గాలుల వల్ల తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏలూరు జిల్లాలో ప్రతి గ్రామానికి ఒక నోడల్ అధికారిని నియమించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలతోపాటు శిథిలావస్థలో ఉన్న భవనాల్లోని ప్రజలను ఆదివారం రాత్రి నుండి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. విద్యుత్, కమ్యూనికేషన్, రోడ్డు రవాణా వ్యవస్థలు స్తంభించకుండా ఆయా జిల్లాల అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్లు ఆదేశించారు. తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ చర్యలను పర్యవేక్షించేందుకు ఇపిడిసిఎల్ కార్యాలయం నుంచి సిజిఎం, జిఎం, ఇఇ, డిఇఇలను ప్రత్యేక అధికారులుగా నియమించారు. మిగిలిన డిస్కంల నుంచి సిబ్బందితో పాటు, పోల్స్, ఇతర సామగ్రిని తుపాను ప్రభావం ఉండేలా ప్రాంతాలకు తరలింపు ప్రక్రియ ప్రారంభించారు. అన్ని డివిజన్లలో విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది.

మొంథా తుపాన్ ప్రత్యేకాధికారిగా ప్రసన్న వెంకటేష్

భీమవరం : మొంథా తుపాన్ ప్రత్యేక పర్యవేక్షణ అధికారి వి.ప్రసన్న వెంకటేష్‌ను ప్రభుత్వం నియమించింది. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి జిల్లాకు ప్రసన్న వెంకటేష్ చేరుకున్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్ కలెక్టర్ చదలవాడ నాగరాణి, జెసి రాహుల్ కుమార్ రెడ్డితో సమావేశమై జిల్లాలో తుపాన్ ప్రభావిత ప్రాంతాలు, ముందస్తుగా తీసుకున్న చర్యలపై సమీక్షించారు. 28న మొంథా తీవ్ర తుపాను రూపంలో తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణం శాఖ హెచ్చరించింది. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అప్రమత్తమైయి రాష్ట్రంలోని అన్ని తీర ప్రాంత జిల్లాలన్నింటికీ సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగింది. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాకు వి.ప్రసన్న వెంకటేశ్ ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు.

నేడు, రేపు పాఠశాలలకు సెలవు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం



మొంథా తుపాను నేపథ్యంలో జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెల 27, 28 తేదీల్లో సెలవు దినాలుగా ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మొంథా తుపాన్ కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించే ఉద్దేశంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్వాడీలు, కళాశాలలు ఇతర విద్యాసంస్థలు అన్నింటికీ రెండు రోజులపాటు సెలవు దినాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఆదేశాలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

ప్రజాశక్తి - భీమవరం

మొంథా తుపాను నేపథ్యంలో ఇపిడిసిఎల్ అప్రమత్తమైంది. ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండేందుకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని, అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఎస్ఇ ఆదేశించారు. తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ చర్యలను పర్యవేక్షించేందుకు ఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి సిజిఎం, జిఎం, ఇఇ, డిఇఇలను ప్రత్యేక అధికారులుగా నియమించారు. మిగిలిన డిస్కాంల నుంచి సిబ్బందితో పాటు, పోల్స్, ఇతర సామగ్రిని తుపాను ప్రభావ జిల్లాలకు తరలింపు ప్రారంభించారు. విద్యుత్ అంతరాయాల సమాచారాన్ని తెలిపేందుకు ఇపిడిసిఎల్ పరిధిలోని అన్ని డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. తెగిపడిన విద్యుత్ వైర్లు, విద్యుత్ స్తంభాలు, పడిపోయిన చెట్లకొమ్మల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వాటి సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబరు 1912 లేదా పశ్చిమగోదావరి సర్కిల్‌లో నరసాపురం 94906 10151, భీమవరం 94906 10143, ఏలూరు సర్కిల్ ఏలూరు 94409 04037, జంగారెడ్డిగూడెం - 94910 30712 కంట్రోల్ రూం నెంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

పంటు రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి - నరసాపురం

బంగాళాఖాతంలో తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నరసాపురం -సఖినేటిపల్లి గోదావరి రేవులో పంటు, పడవలపై రాకపోకలను అధికారులు ఆదివారం నిలిపివేశారు. పంటు రేవులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్కసారిగా పంటు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రముఖ క్షేత్రం అయిన అంతర్వేదికి వెళ్లే యాత్రికులు, కోనసీమ జిల్లాకు వెళ్లే ప్రయాణికులు చించినాడ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగించారు. ముందస్తు సమాచారం లేకుండా పంటు రాకపోకలు నిలిపివేయడంతో ప్రయాణికులు రేవు వరకూ వచ్చి వెను తిరిగారు.

భోజనం హాస్టల్లో.. అన్నీ ఇంట్లోనే..!

వీరవాసరం బిసి హాస్టల్‌లో కానరాని బెడ్స్

స్థానికులే కావడంతో రాత్రివేళల్లో ఇళ్లకు వెళ్లిపోతున్న విద్యార్థులు

విద్యార్థులు లేక మూతపడిన అండలూరు ఎస్‌సి హాస్టల్



అద్దె భవనంలో ఉన్న బిసి బాలుర హాస్టల్



అల్పాహారం తింటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం బిసి బాలుర వసతి గృహానికి సొంత గూడు కరువైంది. దీంతో పాటు మండలంలో కొణితివాడ, రాయకుదురు, అండలూరుల్లో ఎస్‌సి వసతి గృహాలు ఉన్నాయి. ఇవన్నీ సొంత భవనాల్లోనే ఉన్నాయి. విద్యార్థులు లేక అండలూరు ఎస్‌సి వసతి గృహం కొంతకాలంగా మూతపడింది. దీంతో అక్కడి భవనం ప్రస్తుతానికి నిరుపయోగంగానే ఉంది. ఇక వీరవాసరంలోని బిసి హాస్టల్ సైతం విద్యార్థులు లేక వెలవెలబోతుందని చెప్పొచ్చు. అంటే అసలు విద్యార్థులు లేకపోవడం కాదు. విద్యార్థులున్న రాత్రి నిద్రకు సంబంధించిన సరైన సౌకర్యాలు లేకపోవడం, ఇక్కడ చదువుతున్న విద్యార్థులంతా స్థానికులే కావడంతో వారు రాత్రివేళల్లో ఇళ్లకు వెళ్లిపోతున్నట్లు వెల్లడైంది. ఉదయం ఏడు, ఉడున్నర ప్రాంతంలో విద్యార్థులంతా హాస్టల్‌కు చేరుకుంటున్నారు. ఈ హాస్టల్ భవనం అద్దెది కావడం, ఆపై విద్యార్థులు పడుకునేందుకు బెడ్స్ వంటి సౌకర్యం లేకపోవడంతో నేలపైనే నిద్రించాల్సిన దుస్థితి ఉంది. దీంతో విద్యార్థులు రాత్రివేళల్లో ఇంటికి వెళ్లి రావడం నర్వసాధారణంగా మారింది. దీంతో హాస్టల్ నిర్వహణ లక్ష్యం దెబ్బతింటుందని పరిశీలకులు హెచ్చ రిస్తున్నారు.



స్నానం చేస్తున్న వసతి గృహంలో ఉన్న ఒక్క విద్యార్థి

ప్రజాశక్తి పరిశీలన



ఉదయం 6.30కు హాస్టల్లో విద్యార్థుల్లేక ఖాళీగా ఉన్న గదులు

కేవలం 25 మంది విద్యార్థులతో బిసి బాలుర వసతి గృహం కొనసాగుతోంది. ప్రతిరోజూ విద్యార్థులను వసతి గృహానికి రావాలని వారి ఇళ్లకు వెళ్లి తీసుకురావడం హాస్టల్ ఉద్యోగి ఒకరికి పరిపాటిగా మారింది. పదో తరగతి చదివే విద్యార్థులు కేవలం ముగ్గురే ఉండటంతో ట్యూటర్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. భోజనం బాగనే ఉంటుందని, ఇటీవలే దుప్పట్లు ఇచ్చారని విద్యార్థులు చెబుతున్నారు. విద్యార్థులు రాత్రివేళల్లో ఇంటికెళ్లిపోతున్నట్లు వార్డెన్ సైతం అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు విన్పిస్తున్నాయి. విద్యార్థులకు ఏమైనా అనారోగ్యంగా ఉంటే స్థానిక పిహెచ్‌సికి తీసుకెళ్తున్నారు. ఒక వేళ తీవ్ర అనారోగ్యమైతే తల్లిదండ్రులకు కబురు పంపి ఇంటికి పంపించేస్తున్నారు. మొత్తానికి విద్యార్థులున్నా సొంత భవనం లేకపోవడం, బెడ్స్ వంటి సౌకర్యాల లేమితో బిసి వసతి గృహం కొట్టుమిట్టాడుతోంది.

ఎగసిపడుతున్న అలలు

ప్రజాశక్తి - మొగల్తూరు

బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో సముద్రం ప్రమాదకరంగా మారింది. పేరుపాలెం బీచ్‌కు పర్యాటకులు రాకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. బీచ్‌కు వచ్చే ప్రాంతాలలో రహదారులకు అడ్డుగా భారికేడ్లు ఏర్పాటు చేసి మార్గాలను మూసివేసి పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. బీచ్‌కు వచ్చిన వారిని అక్కడ నుంచి తిరిగి వెనక్కి పంపించారు. దీంతో బీచ్ ప్రాంతమంతా నిర్మానుషంగా మారింది.

బీచ్‌కు రావొద్దు : తహాశీల్దార్

పర్యాటకులు నాలుగు రోజుల పాటు బీచ్‌కు రావొద్దని తహాశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. బీచ్‌కు రావడం ప్రమాదకరమని సూచించారు. తరువాత ప్రకటన వెలువడే వరకూ పర్యాటకులు రావొద్దని తెలిపారు.



బీచ్‌కు పర్యాటకులు వెళ్లకుండా పోలీసు బందోబస్తు

నవంబర్ 14, 15 తేదీల్లో రైతు సంఘం జిల్లా మహాసభ

మోగల్లులో నిర్వహణ

మహాసభను విజయవంతం చేయాలి

రైతు సంఘం రాష్ట్ర నాయకులు బలరాం

ప్రజాశక్తి - భీమవరం

నవంబర్ 14, 15వ తేదీల్లో రైతు సంఘం మహాసభ మోగల్లులో నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరాం తెలిపారు. మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎఎస్.రావు నగర్, అలాగే రైతు నేత, అమరజీవి వలవల శ్రీరామ్మూర్తి స్మారక హాలు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ వేదికగా నామకరణం చేశామని తెలిపారు. దీనిలో ఈ మహాసభ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల నుంచి రైతుల సమస్యలపై జరిగిన ఉద్యమాలను సమీక్షించుకుని రాబోయే మూడేళ్లల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. చెమటోడ్చి పంటలు పండిస్తున్న రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు రాష్ట్రంలో సుమారు 60 శాతం మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారన్నారు. అయితే రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదన్నారు. ప్రభుత్వాలు ఎరువులు, పురుగుమందులు, డీజిల్, పెట్రోల్, కరెంటు ఛార్జీలు రకరకాల పన్నులు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచుతున్నాయన్నారు హరిత విప్లవ పితామహుడు ఎంఎస్.స్వామినాథన్ పంట ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి ధర నిర్ణయించాలన్నారు. పాలకులు అంగీకరించారని గుర్తుచేశారు. అయితే అమలు చేయడం లేదన్నారు. కేరళ వామపక్ష ప్రభుత్వ వరికి రూ.600 అదనంగా కలిపి క్వింటాల్‌కు రూ.3,000 చెల్లిస్తోందన్నారు. జిల్లాలో స్వాతంత్ర్య సమరయోధులు ఉద్దరాజురామం, కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి వంటి వారు రైతు సంఘం ప్రారంభించారన్నారు. వారి స్ఫూర్తితో పనిచేస్తోందన్నారు. సాగునీరు, గిట్టుబాటు ధరలు, పంట రుణాలు, నష్టపరిహారాలు, ఇన్సూరెన్స్, యూరియా కోసం, ఎరువులు, పురుగుమందులు, పెట్రోలు, డీజిల్ కరెంటు ఛార్జీల తగ్గింపు రైతుల మోటార్లకు మీటర్లు, ఇళ్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళనలు, ఉద్యమాలు చేస్తోందన్నారు. జిల్లాలో సంఘం, ఉద్యమం బలపడితే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు. విప్లవవీరుడు అల్లూరి, అణుశక్తి సూరీడు, ఎఎస్.రావు వంటి మహోన్నత వ్యక్తులను కన్న గడ్డ మోగల్లు గ్రామం అని, ఈ చారిత్రాత్మక గ్రామంలో జరుగుతున్న రైతు సంఘం జిల్లా మహాసభకు అన్ని మండలాల నుంచీ రైతు సమస్యలపై పట్టుదలతో అంకితభావంతో అంతా విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో రైతాంగ సమస్యలపై రైతు ఉద్యమాలు నిర్వహించేందుకు పెద్దలు, ప్రముఖులు, దాతలు, రైతు శ్రేయోభిలాషులు, అన్ని పంటల రైతాంగం, వర్తక-వాణిజ్య వర్గాలు, వివిధ సంస్థలు, ఉద్యోగులు అందరూ తమ సహాయ సహకారాలు, అందించాలని విజ్ఞప్తి చేశారు.

పొత్తూరి రామరాజు వల్ల పార్టీ భవిష్యత్తు శూన్యం

మంత్రి రవికుమార్‌కు టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామ్మోహనరావు వినతి

ప్రజాశక్తి - నరసాపురం

టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు వల్ల పార్టీ భవిష్యత్తు శూన్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి చిటికెల రామ్మోహనరావు అన్నారు. నరసాపురం మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణ స్వీకార వేడుకలకు ఆదివారం నరసాపురం విచ్చేసిన రాష్ట్ర విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను బాపు ఘాట్ వద్ద కలిసి ఆయన పార్టీలో జరుగుతున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ పొత్తూరి రామరాజు ప్రతిపక్షం, అధికార పక్షంలో పార్టీ అభివృద్ధి కంటే సొంత అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. సీనియర్ నాయకులను పక్కన పెట్టి తన కోటరీలో వ్యక్తులకు, వైసిపి నాయకులకు నామినేటెడ్, పార్టీ కమిటీల్లో పదవులు కట్టబెట్టారన్నారు. పార్టీ కార్యక్రమాలకు అందరినీ కలుపుకోకుండా ఆ పది మందితో తూతూమంత్రంగా పబ్బం గడిపేస్తున్నారన్నారు. ఎఎంసి ఛైర్మన్ ప్రమాణస్వీకార ఆహ్వాన పత్రికలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు పేరు లేకపోవడం ఆయనను రామరాజు ఉద్దేశపూర్వకంగా అవమానించడమే అని తెలిపారు. దీంతో పార్టీ నాయకుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఇన్‌ఛార్జి రామరాజు వర్గ విభేదాలు రాజేస్తూ, టిడిపి తన సొంత పార్టీలా వ్యవహరిస్తున్నారని, దీంతో పార్టీ భవిష్యత్తుపై ప్రభావం చూపి నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ఇన్‌ఛార్జి పదవి నుంచి పొత్తూరి రామరాజును తొలగించాలని కోరినట్లు తెలిపారు. స్పందించిన మంత్రి మాజీ ఎంఎల్ఎ మాధవనాయుడును కలిసి మాట్లాడతానని హామీ ఇచ్చారు. సాయంత్రం మంత్రి రవికుమార్, జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, మాధవ నాయుడును కలిసి పార్టీలో జరుగుతున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

పేకాట ఆడించింది.. పవన్‌కు ఫిర్యాదు చేసింది వాళ్లే

డిఎస్‌పి జైసూర్య విచారణపై గ్రంధి కీలక వ్యాఖ్యలు

భీమవరం టౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి భీమవరంలో క్లబ్బుల్లోనే కాకుండా అనేక ప్రాంతాల్లో రెండు నెలల క్రితం వరకూ పేకాట సాగింది. ఎవరైతే పేకాట నిర్వహించి పెద్ద ఎత్తున లబ్ధి పొందారో వాళ్లే భీమవరం డిఎస్‌పిపై సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్‌కు ఫిర్యాదు చేశారని, మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలైతే 14 నెలల నుంచి ఒక్కో క్లబ్ నుండి నెలకు రూ.10 లక్షలు, బ్రాందీ షాపుల నుండి రూ.4,50,000 వరకూ డబ్బులు వసూలు చేసిన విషయం స్థానిక ప్రజలతో పాటు రాష్ట్రంలోని ఎంఎల్ఎలందరికీ తెలుసని తెలిపారు. ఇప్పటికే చంద్రబాబు పలుమార్లు హెచ్చరించినట్లు మీడియాలో కథనాలు కూడా వచ్చాయన్నారు. అయితే రెండు నెలల నుండి క్లబ్బుల్లో పేకాట నిలిపివేసినందుకు గాను పేకాట ఆడిగినవాళ్లే వెళ్లి చంద్రబాబుకు పవన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని పవన్, చంద్రబాబు చెప్పడం అభినందనీయమని, ఇప్పటికైనా ఇక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవాల తెలిపారు. అధికారులతో కాదని ప్రజలను అడిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. రఘురామకృష్ణరాజు మాట్లాడిన మాటలు వాస్తవమేనని లేకపోతే డిఎస్‌పి నింద పవన్‌పై పడేదని అన్నారు. ఇక్కడ పేకాట ఆడుతున్నట్లు డిఎస్‌పి ఒక్కడికే కాదని, జిల్లా ఎస్‌పికి, ఐజికి తెలుసని తెలిపారు. పవన్ కళ్యాణ్ అపాయింట్‌మెంట్ ఇస్తే అన్ని విషయాలూ ఆయనకు తాను చెబుతానని అన్నారు. రాముడు పేరు పెట్టుకున్నంత మాత్రాన రాముడు అయిపోరని ఈ విషయాన్ని పవన్, చంద్రబాబు గుర్తించాలన్నారు. ఈ మేరకు ఎంఎల్ఎ అంజిబాబును పరోక్షంగా విమర్శించారు.

కడెమ్మ స్ఫూర్తితో పోరాడాలి

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పోరాటయోధుడు, త్యాగధనుడు చింతపల్లి కడెమ్మ నేటి తరానికి ఆదర్శప్రాయుడని, ఆయన స్ఫూర్తితో పోరాడుదామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం పాలకొల్లు మండలం అరటకట్ల గ్రామంలో కడెమ్మ స్తూపం వద్ద 16వ వర్ధంతి సభ సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో నరసింహమూర్తి మాట్లాడుతూ విదేశాల్లో ఉంటూ ప్రభుత్వ పెద్దల అండదండలతో రాష్ట్రంలో ములకలపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో అధునాతన యంత్రాలతో స్పిరిట్ కల్తీ మద్యం రాకెట్టు కుటీర పరిశ్రమగా నడిపిన వారిపై సిబిఐ తో సమగ్ర దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. సిబిఐ ద్వారా అయితేనే వాస్తవాలు బయటికొస్తాయని తెలిపారు. ఎన్నో పోషక విలువలున్న తాటికల్లు అమ్మకాలను కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే దెబ్బతీస్తోందని విమర్శించారు. పేదల కష్టసుఖాలు తెలిసిన కేరళ ప్రభుత్వం మద్యం ఆదాయం ప్రధాన ఆదాయంలా చూడకుండా కల్లుగీత వృత్తిని ప్రోత్సహిస్తూ లక్షల కుటుంబాలను ఆదుకుంటోందన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో గీత కార్మికులను ఒక ఓటు బ్యాంకుగా వాడుకుని తర్వాత కరివేపాకులా ఏరిపారేయడం అలవాటైందన్నారు. జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ గీత వృత్తి ప్రమాదమని తెలిసినా కుటుంబాలను పోషించుకోవడానికి లక్షల మంది ఈ వృత్తిని చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నమ్మి ఓట్లేసిన గీత కార్మికులను మోసం చేయడం ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. గీత కార్మికులు బాధలు చెప్పుకునేందుకు నవంబర్ 17న మంగళగిరి ఎక్సైజ్ కమిషనర్ వద్దకు జిల్లా నుండి అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కడలి పండు, దొంగ సత్యనారాయణ, కడలి బాలాజీ, చింతపల్లి శ్రీనివాసు, చింతపల్లి సత్యనారాయణ, చింతపల్లి నరసింహం, చింతపల్లి శ్రీనివాసు, రాజులపాటి సాంబశివరావు పాల్గొన్నారు.



కడెమ్మ స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించొద్దు

వీరవాసరం: మెడికల్ కళాశాలలలను ప్రయివేటీకరణ చేయడమంటే ప్రజా వైద్యాన్ని దూరం చేయడమేనని సిపిఎం మండల కార్యదర్శి బొర్రా ఆలమహారాజు అన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆదివారం సిసిఎం ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయంలో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో యండమూరి సుబ్బారావు, గొట్టుముక్కల శ్యాంబాబు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు..!

ప్రజాశక్తి - ఆకివీడు


ఆకివీడు కూరగాయల మార్కెట్

కూరగాయల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేనంత స్థాయికి ఎదిగిపోయాయి. శాకాహారి, మాంసాహారి అనే విచక్షణ లేకుండా ప్రతి ఒక్కరూ కచ్చితంగా వాడే పచ్చి మిరపకాయలు కేజీ రూ.80 నుండి రూ.100 పలుకుతున్నాయి. అదే దారిలో వంకాయలు సైతం మండిపోతున్నాయి. ఇక సాధారణ మనుషులు సైతం వినియోగించే టమాటా కూడా ధర మళ్లీ ఆకాశానికి అంటింది. కేజీ రూ.70 నుండి 80 వరకు పలుకుతున్నాయి. బీన్స్, ఆకాకర, క్యారెట్ వంటి కూరగాయలు కేజీ రూ.150పైన పలుకుతున్నాయి. ఆకుకూరలు కూడా మేము ఆ వెనకే ఉన్నాము అంటున్నాయి. సంవత్సరం పొడవునా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే బంగాళదుంప కూడా కేజీ రూ.40 దాటిపోవడం గమనార్హం. మొత్తం మీద వాతావరణం, వానల ప్రభావం సామాన్యుడిపై భారీ స్థాయిలో పడింది. వానల ప్రభావానికి కాయగూరలు పాడైపోతే రైతుతో పాటు వినియోగదారుడు కూడా అదే స్థాయిలో తీవ్రంగా నష్టపోతున్నాడు. ముందుగా రైతుకు తగిలిన తర్వాతే ఆ దెబ్బ వినియోగదారుడుకు తగులుతుంది. అయితే అసలు అక్కడ తోటల పరిస్థితి ఏమిటో ఎవరికీ తెలియక ముందే ఇక్కడ దళారీ వ్యవస్థ ప్రభావంతో రేట్లు ఆకాశాన్ని అందుతున్నాయి. ఇంకొక నాలుగు రోజులు పోతే సామాన్యుడు కూరగాయలు కొనుక్కోలేని పరిస్థితి నెలకొనేలా ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే దీని ప్రభావం మాంసాహారం మీద కూడా పడే ప్రమాదం ఉందని మాంసాహారులు వాపోతున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకునే పరిస్థితి ఏర్పడక ముందే అధికారులు ముందస్తుగానే రంగంలోకి దిగి దళారీ వ్యవస్థను అరికట్టాలని కోరుతున్నారు. రైతుని ఆదుకుని వినియోగదారుడికి దళారుల నుండి రక్షణ కల్పించాల్సి ఉంది.


విర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

శర్మ కుటుంబ సభ్యులకు పరామర్శ

సంతాపం తెలిపిన ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - గణపవరం

యుటిఎఫ్ మండల సీనియర్ నాయకులు కొవ్విడి శర్మ తండ్రి కొవ్విడి వీర్రాజు ఇటీవల అకాల మృతి సందర్భంగా ఆదివారం టీచర్స్ ఎంఎల్‌సి గోపీమూర్తి గణపవరంలో శర్మ ఇంటికి వచ్చి శర్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ సానుభూతిని తెలిపారు. అనంతరం విర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు బొద్దురమేష్, భవానీ ప్రసాద్, సీనియర్ నాయకులు వోతా ఆంజనేయులు, జాలెం రాని, మద్దాల వెంకటేశ్వర్లు, ఎర్రంశెట్టి వెంకటేశ్వరరావు, ఎన్‌వి.సుబ్బారావు, నారాయణ, మామిడిశెట్టి, పెద్దిరాజు ఆదిశేషప్రసాద్, తోట అప్పారావు పాల్గొన్నారు.

ఫ్రీజర్ అందజేత

గణపవరం : మానవత మండల కమిటీ ఆధ్వర్యాన గణపవరం పరిసర గ్రామాల్లో 20 కిలోమీటర్ల వరకు స్థానికులకు ఫ్రీజర్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు మానవత జిల్లా నాయకులు కర్రి వినాయక్, మండల నాయకులు కూచంపూడి జగపతిరాజు చెప్పారు. ఆదివారం బొద్దు శ్రీనివాసరావు ఇంటి ఆవరణలో జరిగిన మానవత మండలకమిటీ సమావేశంలో ఫ్రీజర్‌ను ప్రారంభించారు. ఈ సమావేశానికి గంటా అన్నవరం అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వినాయక మాట్లాడుతూ గణపవరం చుట్టుపక్కల స్తానికులకు ఫ్రీజర్‌ని ఉచితంగా అందజేయటానికి మానవత సంస్థ నిర్ణయించినట్లు చెప్పారు. సంస్థ సభ్యత్వాలు పూర్తి అయినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల నాయకులు పాతపాటి హరికుమార్ రాజు, వంకాయల రామారావు, బుద్దారాపు పుల్లయ్య, కురెళ్ల వెంకటరత్నం, ఎ.రామకృష్ణంరాజు, కుకునూరి నాగేశ్వరరావు, ఎవి.కృష్ణారావు, బొడ్డు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయాధికారులు

తాడేపల్లిగూడెం : మొంథా తుఫాను నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేసేందుకు తాడేపల్లిగూడెం ఎడిఎ ఆర్.గంగాధర్ రావు, మండల వ్యవసాయ అధికారి వి.నారాయణ రావు ఆదివారం మండలంలోని మాధవరం, దండగర్ర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాధవరం గ్రామంలో రైతులలో మాట్లాడుతూ చేళ్లలోని నీళ్ల బయటకు పోయేలా చూసుకోవాలని, రాబోవు రెండు, మూడు రోజుల్లో అధిక వర్షాలు పడితే నీరు నిలవ లేకుండా త్వరగా బయటికి పోయే మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా చేలు పడిపోయిన సందర్భంలో విత్తనం మొలకెత్తకుండా నివారించుటకు లీటరు నీటికి 50 గ్రాము కల్లుప్పు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలని, పడిపోయిన చేళ్లను సాధ్యమైనంత వరకు కట్టలు కట్టుకోవాలని సూచించారు. కొంగు వారి గూడెం ఎర్రకాలువ ప్రాజెక్టు నుండి నీళ్లను కిందకు వదలవలసిందిగా రైతులు కోరారన్నారు. తద్వారా నష్టాన్ని ముందుగా కొంతవరకూ తగ్గించవచ్చని రైతులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎర్రకాలువ ఎఇను సంప్రదించగా ఆదివారం నుండి 1500 క్యూసెక్కుల నీరు కిందకి వదులుతున్నట్లు, సమయాన్ని బట్టి పెంచుతామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో దండగర్ర, మాధవరం రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సత్కారం

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు గ్రామంలో ప్రముఖ ఖండవల్లి కిషోర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన సాయంత్రం డిఎస్‌సి పరీక్షల్లో ఉత్తీర్ణులై వ్యాయామ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను సాధించిన మార్టేరు యూత్ బాస్కెట్‌బాల్ క్రీడాకారులను సత్కరించారు. స్థానిక క్రీడాకారులు సత్తి తేజ కృష్ణారెడ్డి, ఎస్.ఆదిత్యరెడ్డిలకు ట్రస్ట్ ఫౌండర్, అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు సత్తి సుబ్బన్న రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాలం కొండయ్య(పోలీస్ డిపార్ట్మెంట్,) ఇతర సీనియర్ క్రీడాకారులు గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి, వివేకానంద పబ్లిక్ స్కూల్ రామారెడ్డి, కర్రి వినాయక రెడ్డి, తమనంపూడి ఈశ్వర్ రెడ్డి మురళీ, సత్తి సత్యనారాయణ రెడ్డి, కర్రి మురళీ శ్రీనివాస రెడ్డి, ద్వారంపూడి సోమరెడ్డి తదితర సీనియర్ క్రీడాకారులు, యూత్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, కిషోర్ చారిటబుల్ సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో వర్క్‌షాప్

నరసాపురం : స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన ఐఇఇఇ కంప్యూటర్ సొసైటీ స్టూడెంట్ చాప్టర్ సహకారంతో 'సైబర్ సెక్యూరిటీ అండ్ ఇట్స్ ఛాలెంజెస్' అనే అంశంపై ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రధాన వక్తలుగా డాక్టర్ టి.శివరామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, జెఎన్‌టియు కాకినాడ, డాక్టర్ శివకుమార్ పెరుమాళ్, ప్రొఫెసర్, శశి ఇంజినీరింగ్ కాలేజ్ తాడేపల్లిగూడెం పాల్గొని విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై విలువైన జ్ఞానాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్ కుమార్, సిఎస్‌సి విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాసులు, ఐఇఇఇ స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ డాక్టర్ వి.మధు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌లో సుమారు 150 మంది విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, ట్రెజరర్ కెవి.స్వామి, డైరెక్టర్ ఎ.శ్రీహరి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గోపీచంద్ తమ సహకారాన్ని అందించారు.

ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘ సభ్యులు ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు

జిల్లా ఇన్‌ఛార్జి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అట్టహాసంగా ఎఎంసి ఛైర్మన్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - నరసాపురం


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్

కూటమి ప్రభుత్వంలో కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని జిల్లా ఇన్‌ఛార్జి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం అల్లూరి కళ్యాణ మండపంలో ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులు దేశినీడి గంగధర్‌ల ప్రమాణస్వీకార మహోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి దృష్ట్యా మూడు పార్టీల ఐక్యత చాలా ముఖ్యమన్నారు. ప్రజలు, కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు వైసిపి ప్రయత్నిస్తుందని, దీన్ని కూటమి నాయకులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఉపయోగపడే అన్ని పనులు ప్రభుత్వం చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ అరుంధతి సినిమాలోని పశుపతి లాంటోడని, అటువంటి భూతాన్ని సీసాలోనే బందీగా ఉంచాలన్నారు. మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం ఖాళీ అవ్వడం కాయమన్నారు. విప్, ఎంఎల్‌ఎ నాయకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడే కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి రామరాజు మాట్లాడుతూ రైతుల ఆశయాలకు అనుగుణంగా మార్కెట్ కమిటీ పని చేయాలన్నారు. ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎంఎల్‌ఎలు వంగవీటి రాధా, కొత్తపల్లి జానకీరామ్, కార్పొరేషన్ ఛైర్మన్లు రామరాజు, ఎఎ.షరీఫ్, పీతల సుజాత, కొల్లు పెద్దిరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి చిన్న మాట్లాడుతూ 18 నెలల కాలంలో ప్రభుత్వం అంటే ఏమిటో కూటమి ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. ఇదే ఉత్సాహంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ముందుకు సాగాలన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు నీతిమంతమైన పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, వైస్ ఛైర్మన్ గంగాధర్, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

అధికారులంతా అందుబాటులో ఉండాలి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సహాయక చర్యలకు కూటమి శ్రేణులు సిద్ధం

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడి

ప్రజాశక్తి - తణుకు

మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో తణుకు నియోజకవర్గంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. నియోజకవర్గంలోని తాగునీరు, విద్యుత్ సరఫరా, మొబైల్ టవర్స్, సివిల్ సప్లైస్ వంటి అత్యవసర సేవలు నిరంతరం కొనసాగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. గాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉందని విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు పునరుద్ధరించి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. తుఫాను నేపథ్యంలో సహాయ చర్యల్లో పాల్గొనేందుకు అధికారులతో పాటు కూటమి శ్రేణులు సైతం అందుబాటులో ఉండాలని కోరారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా వారికి ఎప్పటికప్పుడు సహాయ సహకారాలు అందించడానికి సరైన రీతిలో స్పందించేలా అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌ఎ రాధాకృష్ణ విజ్ఞప్తి చేశారు.

తాడేపల్లిగూడెం : రానున్న మూడు రోజులు మొంథా తుఫాను సందర్భంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కె.కౌసర్ భానో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈదురు గాలులు, భారీ నుంచి అతి భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలు ఉన్నవారు, శిథిలావస్థ భవనాలలో ఉన్నవారు, లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న వారు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు లేదా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావస్థ కేంద్రాలకు వెళ్లవలసిందిగా పేర్కొన్నారు. అత్యవసర సహాయానికి ఈ కింది తెలిపిన కంట్రోల్ రూమ్ నెంబర్లను లేదా మీ గ్రామ పరిధిలోగల గ్రామ సచివాలయంలో సంప్రదించవలసిందిగా తెలియజేశారు. తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెం 9381701036, 9849712358, తాడేపల్లిగూడెం తహశీల్దార్ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెం 9491041442, పెంటపాడు తహశీల్దార్ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెం 8121341447, తణుకు తహశీల్దార్ కంట్రోల్ రూమ్ నెం 9491041477, అత్తిలి తహశీల్దార్ కంట్రోల్ రూమ్ నెం 7993948739, ఇరగవరం తహశీల్దార్ కంట్రోల్ రూమ్ నెం 9491041476లను సంప్రదించవలసిందిగా పేర్కొన్నారు. ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకొని సురక్షిత ప్రాంతాలలో ఉండవలసిందిగా తెలియజేశారు.

రానున్న మూడు రోజులు 27, 28, 29 తేదీలలో మొంథా తుఫాను ప్రభావం జిల్లాకు వచ్చే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజలందరూ అప్రమత్తమై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పెనుమంట్ర : అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, ఎటువంటి ప్రాణనష్టం కలగకుండా మండల కేంద్రాల్లో హెల్ప్ లైన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ వై.రవికుమార్ తెలిపారు. బలమైన ఈదురుగాలులు వీస్తాయన్నారు. మూడు రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రజలను అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉన్నవారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తామని మండల తహశీల్దార్ తెలిపారు. ప్రతి గ్రామంలోనూ సచివాలయం ఉద్యోగులకు హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయంలో హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఎవరైనా ఇబ్బందులు కలిగి ఉంటే తహశీల్దార్ కార్యాలయానికి సమాచారాన్ని అందించాలని కోరారు. భారీ వృక్షాలు, శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఉండవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితి తప్ప ఎవరూ బయటకు వెళ్లవద్దన్నారు.

గణపవరం : మొంథా తుఫాన్ వల్ల ప్రజలకు రక్షణ కల్పించడానికి వీలుగా మండలంలోని 25 గ్రామాల్లో ఉన్న హైస్కూల్స్‌లో సెల్టర్లు ఏర్పాటు చేసినట్లు గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి ఆదివారం తెలిపారు. తుఫాన్ వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటానికి స్థానిక పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, మహిళ పోలీసులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మొగల్తూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులతో భారీ వర్షాలు సంభవించే ప్రమాదం ఉందని ఆర్‌డిఒ దాసిరాజు హెచ్చరించారు. మండలంలోని పేరుపాలెం, కేపీ పాలెం, పాతపాడు తదితర గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చి, తుఫాన్ సమయంలో ప్రజలు ఇళ్ల నుండి బయటకు రాకుండా అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజల ప్రయాణ, ఆస్తి నష్టాల రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట తహశీల్దార్ కె.రాజకిషోర్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మొంథా తుఫాన్ ఎదుర్కొనేందుకు విస్తృత ఏర్పాట్లు

ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అంతట పూర్తి అప్రమత్తతతో అధికార యంత్రాంగం సన్నద్ధమైందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మొంథా తుఫాను దృష్ట్యా, రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ జిల్లాలోని 7, అగ్ని మాపక కేంద్రాల పరిధిలోని 90 మంది సిబ్బంది అందరినీ అప్రమత్తంగా వుంచడంతో పాటు, అగ్నిమాపక వాహనాలు, అత్యవసర పరికరములు అన్నింటిని సిద్ధంగా వుంచడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 7 అగ్ని మాపక వాహనాలు, 10 నీటిని తోడే యంత్రాలు, 80 లైఫ్ జాకెట్స్, 40 లైఫ్ బాయ్స్, 30 రోప్‌లు, చెట్లను నరకడానికి ఉపయోగించే యంత్రాలు 12 సిద్ధం చేయడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా చెట్లను నరకడానికి 12 బృందాలతో 24 మందిని నియమించడం జరిగిందని తెలిపారు. అలాగే పునరావాస కేంద్రాలను గుర్తించి సిద్ధం చేయడంతో పాటు మెడికల్ క్యాంపులను కూడా ముందస్తుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తుఫాను గాలులు సందర్భంగా పశువులలో వచ్చే గొంతు వాపు వ్యాధిని అరికట్టేందుకు ఇహెచ్‌ఎస్ వ్యాక్సినేషన్ వేయడం జరిగిందని తెలిపారు. నిత్యావసర వస్తువులకు ఇబ్బంది లేని విధంగా అవసరమైన స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసి ఆహార పదార్థాలను ముందస్తుగా నిల్వ ఉంచడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ నెంబర్ 08816 299219, భీమవరం ఆర్‌డిఒ కార్యాలయంలో 98484 13739, 87907 31315, నరసాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో 93911 85874, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయంలో 93817 01036, 98497 12358 కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు ఏదైనా అత్యవసర సమాచారాన్ని తెలియజేయుటకు, సహకారాన్ని పొందడానికి కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు. తుఫాను పరిస్థితులు చక్కపడే వరకు 24/7 కంట్రోల్ రూమ్ పని చేస్తాయన్నారు.

జిల్లాలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

రాబోవు మూడు రోజుల్లో మొంథా తుఫాన్ నేపథ్యంలో అన్ని మండల కేంద్రాలలో ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం జరిగింది. భీమవరం రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయ కంట్రోల్ రూమ్ నెం: 9848413739, 8790731315, భీమవరం తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ నెం: 9491041460, కాళ్ల తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ నెం: 9491041456, ఆకివీడు తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ నెం: 9491041467, ఉండి తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ నెం: 9491041459, పాలకోడేరు తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ నెం: 9491041457, గణపవరం తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ నెం: 8374751009, వీరవాసరం తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ నెం: 9491041458 సంప్రదించాలని అధికారులు తెలిపారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలు ఉన్నవారు, శిథిలావస్థ భవనంలో నివసిస్తున్నవారు, పూరి గుడిసెల్లో నివసిస్తున్నవారు, లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్నవారు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని ఆదేశించారు.


సత్కరిస్తున్న మానవత సభ్యులు

విద్యార్థులను బాధ్యతగా తీర్చిదిద్దాలి

మానవత ఆధ్వర్యాన నూతన ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మెగా డిఎస్‌సిలో ఉపాధ్యాయ కొలువులు సాధించిన వారంతా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం బాధ్యతగా చేయాలని మానవత జిల్లా కమిటీ అధ్యక్షులు కండెపు సూర్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం మండల మానవత శాఖ ఆధ్వర్యాన మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో జరిగిన నూతన ఉపాధ్యాయుల అభినందన సత్కార సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేదికపై డిఎస్‌సి 2025 ద్వారా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన మండలానికి చెందిన వెలగల రమ్యశ్రీ(మార్టేరు-ఆచంట), కాలేపు మేఘమాల(పోలమూరు), సబ్బెళ్ల ఆదిత్య రెడ్డి(ఆలమూరు), సత్తి తేజకృష్ణారెడ్డి(మార్టేరు- పండిత విల్లూరు), పెన్మత్స విమల భార్గవి(పోలమూరు), సత్తి చాందిని(నెగ్గిపూడి -రంపచోడవరం), కోయ సుభాష్(నెలమూరు-పెదమల్లం), సారిపల్లి శ్రీనివాస్(నెలమూరు), షేక్ షరీఫ్ మార్టేరులను మానవత తరుపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా, మండల ప్రతినిధులు కొత్త సత్యనారాయణ మూర్తి, బండి ప్రసాద్, చిర్ల శ్రీనివాస రెడ్డి(సిఎస్‌ఆర్), అమృత వాక్కుల సత్యనారాయణ, చదువుల వెంకట నరేంద్ర, పడాల సువర్ణ గౌరి, కడలి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టీచర్లను సత్కరించిన మంత్రి

పాలకొల్లు : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సిఎం అయ్యాక మొదటి సంతకం డిఎస్‌సి ఫైల్ పైనే సిఎం చంద్రబాబు పెట్టారని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ డిఎస్‌సి ఉచిత కోచింగ్‌లో ఉద్యోగాలు సాధించిన 40 మంది టీచర్లను ఆదివారం రాత్రి పాలకొల్లులో మంత్రి సన్మానించారు. ధర్మారావు ఫౌండేషన్ అందించిన ఉచిత డిఎస్‌సి కోచింగ్‌లో శిక్షణపొంది, ఉపాధ్యాయ పోస్టులు సాధించిన 40 మంది యువతను మంత్రి సత్కరించారు. లోకేష్ విద్యారంగంలో నూతన సంస్కరణలు తీసుకొస్తున్నారన్నారు.

ధాన్యానికి క్వింటాకు రూ.3 వేలు చెల్లించాలి

భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

రైతు, కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు




మోగల్లులో నిరసన తెలియజేస్తున్న నేతలు, రైతులు

దేశానికి అన్నం పెట్టే రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, ధాన్యానికి క్వింటాకు రూ.3 వేలు అందించాలని రైతు, కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరాం డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మోగల్లులో రైతు సంఘం, కౌలు రైతు సంఘం, ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యాన ఆదివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. కానీ రైతులకు మాత్రం గిట్టుబాటు ధర కల్పించలేకపోవడం దారుణమన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఎరువులు, పురుగుమందులు, డీజిల్, పెట్రోలు, కరెంటు ఛార్జీలు, రకరకాల పన్నులు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేరళ వామపక్ష ప్రభుత్వం వరి పంటకు రూ.600లు అదనంగా కలిపి క్వింటాలకు రూ.3 వేలు చెల్లిస్తుందని, ఈ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారుతున్న రైతాంగం స్థితిగతులు మాత్రం మారట్లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సాగులో నష్టపోతున్న జీవితాన్ని నెట్టుకొస్తున్న రైతాంగం పట్ల ప్రభుత్వం వివరిస్తున్న తీరు సరైనది కాదని విమర్శించారు. వివిధ రకాల పంటలు పండించే రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేతలు శేషాపు ఆశ్రియ్య, పాల వెంకటస్వామి, రైతులు, కౌలు రైతులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

30 ఏళ్ల తర్వాత అర్హత పరీక్షలా!

2010 ముందు నియామకాలకు మినహాయింపు ఇవ్వాలి : యుటిఎఫ్

ఆకివీడు : ఉద్యోగంలో చేరిన 30 సంవత్సరాల తరువాత అర్హత పరీక్ష లా అంటూ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్‌విఎస్ నారాయణ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు సెప్టెంబర్ 1వ తేదీన జారీచేసిన తీర్పు ప్రకారం దేశంలో ఉపాధ్యాయులందరూ అర్హత పరీక్ష పాస్ కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు అర్హత పరీక్ష మినహాయయింపు నివ్వాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నందున ఉపాధ్యాయ అర్హత పరీక్షపై సుప్రీం కోర్టులో కేరళ, తెలంగాణ, తమిళనాడు మాదిరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పక్షాన సమీక్ష పిటీషన్ దాఖలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హడావుడిగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష నోటిఫికేషన్ జారీ చేయడం అన్యాయమని వెంటనే నోటిఫికేషన్ నిలుపదల చేయాలని, ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ప్రస్తుత పరిస్థితులను చక్కదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. 55 సంవత్సరాలు పైబడినవారు ఈ వయస్సులో పరీక్షల్లో పాస్ అవ్వడం, ఫెయిల్ అయితే ప్రమోషన్ అర్హత కోల్పోతారని నిర్ధేశించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వివరించారు. బోధనేతర పనులు రద్దు చేయాలని, మూల్యాంకనం సరళీకృతం చేయాలన్నారు.


శశి మధును అభినందిస్తున్న చెరుకువాడ

రాజకీయాల్లో యువత పాత్ర కీలకం

మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

నేటి రాజకీయాల్లో యువత పాత్ర చాలా ముఖ్యమని వైసిపి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. వైసిపి మండల యువజన విభాగం(యూత్) అధ్యక్షులుగా కోటి శశిమధు నియమితులయ్యారు. ఆదివారం కోటి శశిమధు మాజీ మంత్రి, రాష్ట్ర పిఎసి మెంబర్ చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రాజకీయాలలో యువతపాత్ర చాలా ముఖ్యమని అన్నారు. కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీ, నిరుద్యోగభృతి అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరించి పేద విద్యార్థులకు వైద్య విద్యను చంద్రబాబు దూరం చేశారని విమర్శించారు. గ్రామ స్థాయి నుండి వైసిపి యువజన విభాగాన్ని బలోపేతం చేసే విధంగా గ్రామ కమిటీ లు ఏర్పాటు చేసి, కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై యువత పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కోట వెంకటేశ్వరరావు, సుంకర సీతారామ్, ఆదిమూలం ఏసు, బోడపాటి సత్యనారాయణ, పుచ్చకాయల నాగార్జున, యూత్ నాయకులు కొంబొత్తుల దుర్గాప్రసాద్, కోట గిరిధర్ పాల్గొన్నారు.

వన సమారాధనతో సత్సంబంధాలు పెంపు

మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుగొండ

కార్తీక వన సమారాధనలు సంఘ ఐక్యతను, సత్సంబంధాలను పెంపొందిస్తాయని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ అన్నారు. ఆదివారం పెనుగొండ మార్కెట్ యార్డులో నిర్వహించిన ది పెనుగొండ ఐరన్ స్టీల్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పితాని వెంకట్ మాట్లాడుతూ కార్తీక వన సమారాధనలు సంఘ ఐక్యతకు, సభ్యుల మధ్య స్నేహపూరిత వాతావరణం పెరగడానికి, సంఘ పటిష్టతకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పెనుగొండలో ఐరన్ స్టీల్ మర్చంట్ వ్యాపారం ఎంతో ప్రసిద్ధిగాంచిందని, ఇకముందు కూడా సంఘం ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని అన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం వివిధ ఆటపాటలలో పాల్గొని విజేతలైన వారికి వెంకట్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కుడిపూడి శ్రీనివాసరావు, నౌడు దుర్గారావు, దొడ్డిపట్ల రాంబాబు, దొడ్డిపట్ల శివ, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 108, 104 వాహనాల ఏర్పాటు

ఎంపిడిఒ బేబిశ్రీలక్ష్మి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో గణపవరం పంచాయతీ వద్ద 108 వాహనం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 104 వాహనం ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ బేబి శ్రీలక్ష్మి తెలిపారు. పిప్పర పిహెచ్‌సి వద్ద 104 వాహనం ఏర్పాటు చేసామని, జెసిబి రోడ్డు, భవనాలు అధికారుల వద్ద ఉటుందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇరువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

రహదారి ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందగా ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ వై.నాగలక్ష్మి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసాపురం గ్రామీణ మండలం లక్ష్మణేశ్వరంలోని దేవుని తోటకు చెందిన మల్లుల దుర్గాప్రసాద్(25), కుడిపూడి సాయికృష్ణ, కవురు ప్రవీణ్‌లు ద్విచక్ర వాహనంపై మొగల్తూరు మండలంలోని బీచ్‌కు ఆదివారం సాయంత్రం బయలుదేరారు. ఈక్రమంలో కేపీ పాలెం సౌత్‌లో బీచ్ రోడ్‌లో వాహనం అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న కొబ్బరి చెట్టును ఢీకొంది. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అత్యవసర వాహన సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకుని వారిని నరసాపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మల్లుల దుర్గాప్రసాద్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీనిపై దుర్గాప్రసాద్ తండ్రి మల్లుల ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆచంట

ఆస్తి తగాదాల నేపథ్యంలో మనస్థాపానికి గురై ఓ వ్యక్తి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెదమల్లం గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని పెదమల్లం మాచెనమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో ఓ వ్యక్తి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన బొలిశెట్టి నరసింహ రాజు(45) జెసిబి నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆస్తి పంపకాలు జరగడం లేదని మనస్థాపానికి గురై గోదావరిలో దూకి శనివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో వశిష్ట గోదావరి పరిసర ప్రాంతాల్లో మత్స్యకారుల జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం ఆదివారం ఉదయం పెదమల్లం మాచెనమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో మృతదేహం జాలర్లకు చిక్కడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మృతదేహానికి తహశీల్దార్ శేషు పంచనామా నిర్వహించారు. మృతుడు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఆచంట ఎస్‌ఐ కె.వెంకటరమణ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.